# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-12-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలో గత ఐదేళ్లపాటు అక్రమంగా బియ్యం ఎగుమతి చేశారని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.**
2. **రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం ఈ నెల 4వ తేదీకి బదులుగా 3వ తేదీన జరుగుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.**
3. **ఫెయింజల్ తుపాను ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి.**
4. **అనంతపురం జిల్లా విడపనకల్లు వద్ద కారు అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు.**
5. **ప్రపంచ ఎయిడ్స్ వ్యాధి అవగాహనా దినాన్ని ఈ రోజు నిర్వహిస్తున్నారు.**

============================

రాష్ట్రంలో గత ఐదేళ్లపాటు అక్రమంగా బియ్యం ఎగుమతి చేశారని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ప్రజా పంపిణీ బియ్యం కోసం 12 వేల 800 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. విజయవాడలో ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. జూన్ చివరి వారంలో కాకినాడలోని 13 గిడ్డంగుల్లో తనిఖీ చేసినట్టు తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యంలో 25 వేల టన్నుల ప్రజాపంపిణీ బియ్యాన్ని గుర్తించి, గిడ్డంగుల యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని వెల్లడించారు. రేషన్ బియ్యం విషయంలో కాకినాడ పోర్టుపై ప్రత్యేక దృష్టిసారించామని మంత్రి నాదెండ్ల మనోహర్ వివరిస్తూ...

వాయిస్ (42 సెకన్లు)

---------------------------

రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం షెడ్యూల్‌లో మార్పు జరిగింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈ నెల 4వ తేదీన జరగాల్సిన మంత్రి వర్గ సమావేశాన్ని ఈ నెల 3వ తేదీకి మారుస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ముందుగా 4వ తేదీన గుంటూరు జిల్లా వెలగపూడి సచివాలయంలో సమావేశం ఉంటుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, తాజాగా సమావేశం తేదీని ఒకరోజు ముందుకు మారుస్తూ మరోసారి ఆదేశాలు జారీ చేశారు. ఈ రోజు సాయంకాలం 4 గంటలలోపు ప్రతిపాదనలు పంపాలని శాఖాధిపతులను ఆదేశించారు.

---------------------------

ఫెయింజల్ తుపాను ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ కారణంగా విశాఖపట్నం నుంచి పలు విమాన సర్వీసులు రద్దయ్యాయి. తిరుపతి జిల్లాలో తుఫాన్ ప్రభావంతో రెండవరోజూ ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టరేట్‌లో తుఫాను కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. మత్స్యకారులను చేపలవేటకు అనుమతించలేదు. గంటకు 50 నుంచి 60 కిమీ వేగంతో ఈదురుగాలులు వీస్తుండటంతో ఒక్కసారిగా చలి తీవ్రత పెరిగింది.

---------------------------

తిరుమలలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఐదు ప్రధాన జలాశయాలు దాదాపు పూర్తిగా నిండిపోయాయి. తిరుమల నీటి అవసరాలకు పాపవినాశనం, ఆకాశగంగ, గోగర్భం, కుమారధార, పసుపుధార జలాశయాలు ప్రధాన వనరులుగా ఉన్నాయి. ఈ రోజు ఉదయం 8 గంటల సమయానికి మొత్తం ఐదు జలాశయాల్లో నీటి మట్టం దాదాపు పూర్తి స్థాయికి చేరుకుందని తిరుమల తిరుపతి దేవస్థానం ఒక ప్రకటనలో తెలిపింది.

---------------------------

అనంతపురం జిల్లా విడపనకల్లు వద్ద కారు అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. మరో వ్యక్తికి తీవ్రగాయాలు కాగా.. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. తీవ్రమైన మంచు వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. మృతులను బళ్లారికి చెందిన ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులుగా గుర్తించారు. వీరంతా హాంకాంగ్ విహారయాత్రకు వెళ్లి వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగింది.

---------------------------

రైళ్లలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని విజయవాడ అదనపు డివిజన్ రైల్వే మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు . విజయవాడలోని మెకనైజ్డ్ బూట్ లాండ్రీలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో విజయవాడ, కాకినాడలోని మెకనైజ్డ్ బూట్ లాండ్రీలు నెలలో 6 లక్షల 50వేలకు పైగా బెడ్ షీట్లు, సుమారు 10 వేల ఉన్ని దుప్పట్లను శుభ్రం చేస్తున్నాయని తెలిపారు. రైల్వే బోర్డు నిర్దేశించిన పరిశుభ్రత ప్రోటోకాల్‌ను ఖచ్చితంగా పాటిస్తున్నారని అదనపు డివిజన్ రైల్వే మేనేజర్ వివరిస్తూ..

వాయిస్.. 35 సెకన్లు

---------------------------

ప్రపంచ ఎయిడ్స్ వ్యాధి అవగాహనా దినాన్ని ఈ రోజు నిర్వహిస్తున్నారు. అపరిచిత వ్యక్తులతో లైంగిక సంబంధాల ద్వారా సోకే ఈ వ్యాధి పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య శాఖ అధికారులు విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఆరోగ్య శాఖ అధికారుల ఆధ్వర్యంలో అవగాహనా సదస్సులు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఐక్యరాజ్య సమితి పిలుపు మేరకు 1988 సంవత్సరం నుండి ఏటా డిసెంబర్ 1వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది.

ఎయిడ్స్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసుల రెడ్డి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ అవగాహనా దినాన్ని పురస్కరించుకుని ఈ రోజు ఒంగోలులో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీని ఒంగోలు కలెక్టర్ కార్యాలయం వద్ద శ్రీనివాసుల రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ....

...వాయిస్ .. 26 సెకన్లు

---------------------------

ఎయిడ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని పెద్ద ఎత్తున అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీహరి తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ అవగాహన దినం సందర్భంగా తిరుపతిలోని రుయా ఆస్పత్రి నుంచి అవగాహనా ర్యాలీని ఆయన ఈరోజు ప్రారంభించారు.

ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ అవగాహన దినం సందర్భంగా ఈ రోజు నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ అప్రమత్తంగా ఉండటంతోనే మహమ్మారిని అంతం చేయగలమని తెలిపారు.

ప్రపంచ ఎయిడ్స్ అవగాహనా దినం సందర్భంగా కడప నగరంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ ఎయిడ్స్‌పై ఇప్పటికే అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని.. యువతలో ఈ అంశంపై మరింత అవగాహన కల్పించాల్సిన నేపథ్యంలో ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు.

చిన్నారుల్లో ఎయిడ్స్ పట్ల అవగాహనతోపాటు వారిలో మనో ధైర్యాన్ని కల్పించి వారికి అండగా నిలిచేందుకు సామూహిక అల్పాహారం కార్యక్రమాన్ని విజయవాడ పున్నమి ఘాట్‌లో శనివారం నిర్వహించారు. హెచ్ఐవీ సోకిన పిల్లల్లో మనోధైర్యాన్ని పెంచడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి.. అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ సరస్వతి తెలిపారు.

---------------------------

ప్రాణాలను లెక్కచేయకుండా దేశ సరిహద్దులను కంటికి రెప్పలా కాపాడుతున్న సరిహద్దు భద్రతాదళం.. బీఎస్ఎఫ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఈరోజు జరుపుకొంటున్నాం. 1965లో భారత్–పాకిస్థాన్ యుద్ధం సందర్భంగా అదే ఏడాది డిసెంబర్ 1వ తేదీన సరిహద్దు భద్రతాదళం ఆవిర్భవించింది. ఈ సందర్భంగా సరిహద్దు ప్రాంతాల్లో సైనికులు కనబరుస్తున్న ధైర్యసాహసాలను గుర్తు చేసుకుంటూ.. దేశవ్యాప్తంగా ఈరోజు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

---------------------------

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇందుకోసం ఇంటర్ విద్యా మండలి సంకల్ప్ పేరిట ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. ఈ కార్యక్రమం ఈ రోజు నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు అమలు కానుంది. చదువులో వెనుకబడిన విద్యార్థులకు సంకల్ప్ కార్యక్రమం ద్వారా ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. మార్చిలో జరిగే వార్షిక పరీక్షలకు వీరిని తీర్చిదిద్దేందుకు ప్రతిరోజు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు అధ్యయన తరగతులు నిర్వహిస్తారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ వక్ఫ్‌బోర్డును రాష్ట్ర ప్రభుత్వం రద్దుచేసింది. గతంలో బోర్డును నియమిస్తూ జారీచేసిన జీఓ 47ను వెనక్కు తీసుకుంటూ నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రంలోని వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకుగాను ఈ నిర్ణయం తీసుకున్నామని మైనారిటీ సంక్షేమశాఖ కార్యదర్శి హర్షవర్ధన్ నిన్న విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

=====================